క్లుప్తంగా

ఇంటినుంచే ఓటు వేసిన వృద్ధులు



చుక్కమ్మతో ఓటు వేయిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: పోలింగ్ కేంద్రానికి వెళ్లలేని 85 సంవత్సరాల దాటిన వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యం ఎన్నికల కమిషన్ కల్పించింది. 18 మంది వృద్ధ ఓటర్లను గుర్తించిన అధికారులు శుక్రవారం ఇంటివద్దకు పోలింగ్ అధికారులు వెళ్లి ఓటు వేయించారు. ఇన్‌చార్జ్ అధికారి శంకర్, పోలింగ్ ఆఫీసర్లు ప్రభాకర్‌రావు, కౌసల్య, శంకర్‌రావు, మైక్రో అబ్జర్వర్ విక్రమ్‌రెడ్డి, ఆర్‌ఐ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం వితరణ

టేకులపల్లి: టేకులపల్లి మండలం తడికలపూడి గ్రామ పంచాయతీ కోక్యా తండాలో భూక్యా చిన్య ఇటీవల మృతి చెందాడు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. ఇదే గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, కోరం కనకయ్య యూత్ నాయకుడు ధరావత్ లక్ష్మణ్ స్పందించి శుక్రవారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశాడు. కార్యక్రమంలో బోడ భీముడు, లాల్యా, బాలు, బోడ గన్ను, మాలోతు రాములు, బిచ్చు, దినేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి..



నాగారంలో ప్రచారం చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్ రావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మండలంలోని నాగారం గ్రామంలో మాజీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెరువు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంత్‌నగర్ పరిధిలో జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, మడిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, భూక్యా రవినాయక్, గంధం నాగేంద్రప్రసాద్, గంగపురి దుర్గాప్రసాద్, మురళి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

సుజాతనగర్: సుజాతనగర్‌లో ఉపాధి కూలీలపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. స్థానిక ముత్యాలమ్మ గుడి సమీపంలో చెరువు వద్ద కూలీలు ముళ్లపొదలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడికి దిగాయి. దీంతో కూలీలు పరుగులు తీశారు. మక్బూద్, మయిన్నీషా, బియమ్మ, ముబీనాలు తీవ్రంగా గాయపడగా వీరిని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఎంపీడీఓ వెంకటలక్ష్మి కూలీలను పరామర్శించి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: పని ప్రదేశంలో ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు ఇఫ్టూ, ఏఐకేఎంఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి మాట్లాడుతూ.. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలీ రూ.750 చెల్లించాలని, పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, సూర్ణపాక నాగేశ్వరరావు, మూడు మాలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఉపాధి హామీ పనుల వద్ద కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని ఇఫ్టూ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. బంద్రుగొండ గ్రామంలో శుక్రవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ఉపాధి కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజాస్వామ్య మనుగడను కాపాడుకుందాం..

- నూరు శాతం ఓటింగే లక్ష్యం..
- స్వీప్ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు
- ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన
- లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పెంపుపై దృష్టి

చుంచుపల్లి: పౌరులకు ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతీఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతగా నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. ఓటు హక్కు అత్యంత పవిత్రమైంది కూడా.. పరిపాలనా విధానానికి ఆయుధం లాంటిది. అందుకే ఎలాంటి ప్రలోభాలకు తలవంచకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి దిక్సూచి అయిన ఓటును వినియోగించుకోవటం ప్రజల ప్రధాన కర్తవ్యం. అప్పుడే దానికి సార్థకత ఉంటుంది. లౌకిక, సామ్యవాద, సర్వసత్తాక, ప్రజాస్వామిక దేశమని మన రాజ్యాంగంలో మనమే చెప్పుకున్నాం. స్వేచ్ఛా సమానత్వం మనదేశ ఆదర్శం. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమాజంలోని ప్రతీఒక్కరు సమానమని, అందరికీ సమానమైన స్వేచ్ఛ, హక్కులు ఉండాలని రాజ్యాంగంలో రాసుకున్నాం. వ్యక్తులు లేనిదే సమాజం లేదు. సమాజంలో అంతర్భాగం కాకుండా ఏ వ్యక్తీ విడిగా మనుగడ సాగించనూ లేదు. అందుకే అందరి కోసం ఒక్కడు నిలిచి, ఒక్కడి కోసం అందరు కలిసి, ప్రజాస్వామ్య మనుగడను కాపాడుకోవాలంటే ఓటు హక్కు ఒక్కటే మార్గం. సమాజంలో ప్రతీ పౌరుడికి ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. ఎన్నికల్లో తమకు నచ్చిన అవినీతి రహిత పాలన అందించే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే హక్కు ఈ ఓటు ద్వారానే సాధ్యపడుతుంది. ప్రజాస్వామ్య విలువ ఉన్న సమాజమే ప్రజా సంక్షేమానికి నాంది పలుకుతుంది. పౌరుడి అస్తిత్వానికి ప్రతీక. ప్రపంచ స్థితి, గతులను మార్చే శక్తి ఓటుకు ఉంది. ఒక వ్యవస్థకు ప్రజా ప్రతినిధి ఎంత అవసరమో, ఆ ప్రజా ప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు అంతే అవసరం. కానీ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలి.. మనం బాగుపడాలి అనే తాపత్రయం ఉండడమే కాదు ఓటూ ముఖ్యమే. అందుకే భారత ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ప్రతీఒక్కరు తమ కర్తవ్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.



ఓటు వినియోగంపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు

పురుషులు	1,19,477
మహిళలు	1,27,979
ఇతరులు	38
మొత్తం ఓటర్లు	2,47,494

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అవగాహన...

ఓటుహక్కు వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో.. ఓటేయడంలో అంతే నిజాయితీగా వ్యవహరించడం అవసరం. ఇప్పుడు వేసే ప్రతీ ఓటు.. భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని ఓటర్లు గుర్తించాలి. ఈ విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఎన్నికల నిర్వహణ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ... ప్రచారం చేపట్టారు. పోలింగ్ శాతం పెంచడంతో పాటు ప్రతీఒక్కరు నిజాయితీగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో స్వీప్, సాంస్కృతిక సారధి కళాకారులు చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటరుగా నమోదైన ప్రతీఒక్కరు ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, నిజాయితీగా ఓటేయాలని కళాబృందాలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వివరిస్తున్నారు. వివిధ కాలనీలు, బస్తీలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, కమ్యూనిటీ హాల్స్ ఇలా ఓటర్లుండే ప్రతీ ప్రాంతంలో కళాజాతా నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తేదీ మే 13 గురించి ప్రజలకు గుర్తు చేస్తూ చైతన్యపరుస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు.



కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో స్వీప్ ఆధ్వర్యంలో పల్లెలు, పట్టణాల్లో ఓటుహక్కు వినియోగంపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీరోజు స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో కళాజాత కళాకారులు ఆటపాటలు, నాటికల ప్రదర్శనలతో ఓటు విలువపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. అటు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. గ్రామాల్లో ఓటు విలువ గురించి వాల్ రైటింగ్స్ రాయిస్తున్నాం.

– ఎం.విద్యాచందన, స్వీప్ నోడల్ ఆఫీసర్

గిరిజన గ్రామాల్లో మలేరియా పరీక్షలు

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం సంగం గ్రామంలో హెల్త్ సెంటర్‌ను మెడికల్ ఆఫీసర్ రాజు తనిఖీ చేశారు. అనంతరం ఎర్రబోరు, తోగ్గూడెం తండా తదితర గిరిజన గ్రామాల్లో వైద్యసిబ్బంది మలేరియా పరీక్షలు నిర్వహించారు. గిరిజనుల నుంచి రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. అనంతరం వైద్యసిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్‌ఎస్ కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం పద్మ, దేవమణి పాల్గొన్నారు.

మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య సేవలు...

దంతలబోరు గ్రామపంచాయతీ ఎర్రబోరు గ్రామానికి శుక్రవారం ఆశాలు ఈశ్వరమ్మ, మేరీకుమారి ఎండలో మూడు కిలోమీటర్ల కాలినడకన వెళ్లి ఆదివాసీ గిరిజనులకు వైద్యసేవలు అందించారు. గ్రామానికి వెళ్లేందుకు రహదారి మార్గం ఉన్నా వాహనాల రాకపోకలు లేకపోవడంతో విధినిర్వహణలో భాగంగా ఆ గ్రామానికి వెళ్లి ఇంటింటికీ తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించారు.



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్యసిబ్బంది

అడ్మిషన్లు ప్రారంభం

పాల్వంచ: స్థానిక మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్.బిపాషా శుక్రవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, నీట్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9581786989 సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు పాటించాలి



కార్మికులకు టోపీలు అందజేస్తున్న శేషాంజన్‌స్వామి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తెలిపారు. తన సొంత ఖర్చులతో 200 టోపీలను తయారు చేయించి శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎండ నుంచి కొంత ఉపశమనం కలిగే విధంగా కార్మికుల కోసం టోపీలను ప్రత్యేకంగా తయారు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు..



మాట్లాడుతున్న ఎంపీపీ సరస్వతి

పాల్వంచరూరల్: వేసవికాలంలో ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మడవి సరస్వతి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ కారణంగా చాలామంది అధికారులు సమావేశానికి హాజరు కాలేదని గ్రామీణ ప్రాంతంలో నీటి ఎద్దడి సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అధికారులను కోరారు. ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ... అధికారులు విధినిర్వహణలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, ఎంపీఓ బొగ్గ నారాయణ, ఏపీఓ పౌరండ్ల రంగా, ఏపీఎం, రాంబాబు, ఏఈలు నీలావతి, సరస్వతి, ఉర్మిళ, మంగు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వడదెబ్బతో ప్రాణానికి ముప్పు



డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: వేసవిలో రోజురోజుకు పెరుగుతున్న భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారని, వడదెబ్బతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న దృష్ట్యా అత్యవసర పరిస్థితిలో అయితేనే బయటకు వెళ్లాలని, అందుకు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్లలో నుంచి బయటకు రావొద్దన్నారు. తరుచూ నీళ్లు తాగుతూ ఉండాలని, అత్యవసరమైతే బయటకు వెళ్లేటప్పుడు గొడుగు గానీ, తలపై టవల్‌గానీ, తెల్ల టోపీ ధరించడంతోపాటు, వెంట నీళ్లు తీసుకెళ్లాలన్నారు. వడదెబ్బకు గురైతే సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తే పూర్తిస్థాయిలో వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. ఎండ తీవ్రతకు పెద్దలతో పోలిస్తే పిల్లలు అధికంగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

డీహైడ్రేషన్ లక్షణాలు..

- మూత్రం పసుపు రంగులో వస్తుంది.
- అకస్మాత్తుగా బరువు తగ్గుతారు, శరీరం పొడిబారుతుంది.
- లోతుకు పోయిన చమ్మలేని కళ్లు ఉంటాయి. చంటి పిల్లలకు మాడు లోపలికి పోతుంది.
- శరీరం సాగే శక్తిని కోల్పోతుంది. చర్మాన్ని పైకి లాగినప్పుడు ముడత యథాస్థానానికి నెమ్మదిగా వెళితే డీహైడ్రేషన్‌గా గుర్తించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- డీహైడ్రేషన్‌కు గురైన వ్యక్తి నీరు, మజ్జిగ, తదితర పానీయాలు అధికంగా తీసుకోవాలి.
- డీహైడ్రేషన్ అయిన వ్యక్తికి ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందిస్తూ ఉండాలి.
- చిన్న పిల్లలకు దాహం అని చెప్పరు, కావున, తల్లిదండ్రులే మాటిమాటికి నీటిని తాగించాలి.

ఇండియా కూటమిని గెలిపిద్దాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): ఐక్యతతో కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం.. మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం.. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. దేశంలో మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని ఎన్ఎండీసీ లాంటి మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరింపజేయాలని, పాల్వంచ కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని, నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 4న ప్రకాశం స్టేడియంలో జరుగనున్న కాంగ్రెస్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, కంచర్ల చంద్రశేఖర్‌రావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి..

పాల్వంచ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొత్తగూడెంలో పాల్గొంటున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించే బహిరంగ సభలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ అభ్యర్థులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు, అభిమానులు, కార్యకర్తల భారీగా తరలిరావాలని కోరారు. నూకల రంగారావు, కొండెం వెంకన్న, బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, వెంకటేశ్వరరావు, అయిత గంగాధర్, ఆచార్యులు, మనోహర్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి..

కొత్తగూడెంలో శనివారం జరగనున్న బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడవల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ చేపట్టే సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. శుక్రవారం వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్ రావు నివాసంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్త సమావేశానికి వైరా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడంతోపాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులు క్లీన్ స్వీప్ చేసి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంగన్నపాలెం, జూలూరుపాడు, సాయిరాంతండా, పుల్లుడుతండా, గాంధీనగర్, గంగారంతండా, తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 కుటుంబాలు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, బొర్రా రాజశేఖర్, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, బానోత్ స్వాతి, వేల్పుల నరసింహారావు, రోకటి సురేష్, బానోత్ లాలు నాయక్, దుద్దుకూరి సుమంత్, యల్లంకి పుల్లయ్య, సున్నా రంగారావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ప్రజలను అభ్యర్థించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బలరాంను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జి.రవి ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని పోలారం, పోచారం, కొమురారం, బోయి తండా పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల చెంతకు వెళ్లి బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీని గద్దె దించాలని, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని, అందుకు బలరాం నాయక్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో అజ్మీరా రవి, సతీష్, సురేష్, వెంకటనర్సయ్య, సమ్మయ్య, చంద్రశేఖర్, ప్రభాకర్, వంశీ, కోటి, రమేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకావిష్కరణ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ.. 1959 మే 3న న్యూఢిల్లీలో ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందని ఈ 65 సంవత్సరాల్లో అనేక పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు.

విద్య, వైద్యం ఉపాధి కోసం అనేక పోరాటాలు చేసిన ఘనచరిత్ర మా విద్యార్థి సంఘానికి ఉందన్నారు. దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలపై గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు యువత పోరాటాలు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో ప్రధాన పాత్ర పోషించారని, అదేవిధంగా పార్లమెంట్‌లో భగత్‌సింగ్ నేషనల్ గ్యారెంటీ స్కీం చట్టంగా అమలు చేయాలని యువత ఉద్యమ బాటలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఐఎన్‌టీయూసీ ఆధర్వ్యంలో... కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియా పరిధిలోని హెడ్డాఫీస్, సెంట్రల్ వర్క్‌షాపు, సెంట్రల్ వర్క్‌షాపు, సివిల్, డిపార్ట్‌మెంట్‌లలో ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు ఆల్బర్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఆల్బర్ట్ మాట్లాడుతూ... స్వాతంత్రం రాకముందే పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, శంకర్రావ్ దియో, జగ్జీవన్‌రామ్‌లు కలిసి కార్మికుల శ్రేయస్సు కోసం ఐఎన్‌టీయూసీ యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తరువాత 1994 నుంచి ప్రపంచ కార్మిక సంఘం నాయకులు, ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకులు డాక్టర్ సంజీవరెడ్డి నాయకత్వం వహించి అనేక రకాల కార్మికుల సమస్యలను, చట్టాల సంస్కరణలు చేసిన ఘనత ఐఎన్‌టీయూసీదేనని, ఈరోజు దేశవ్యాప్తంగా అత్యధిక సభ్యత్వం కలిగిన యూనియన్ ఐఎన్‌టీయూసీదని తెలిపారు.

రోళ్లపాడు ప్రాజెక్టుకు ఈసారైనా మోక్షం కలిగేనా?



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

టేకులపల్లి: టేకులపల్లి మండలం రోళ్లపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్దకాలం కావొస్తున్నా దాని గురించి పట్టించుకున్న నాథుడే లేడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ టేకులపల్లి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోళ్లపాడు ప్రాజెక్టు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గానికి నీళ్లు అందించే విధంగా శంకుస్థాపన చేస్తే అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ ప్రాజెక్టును తనకు అనుకూలంగా డిజైన్ చేసుకొని తన నియోజకవర్గమైన సత్తుపల్లి వైపు మళ్లించుకున్నాడని ఈ విషయం అప్పటి ఎమ్మెల్యేకు కూడా తెలుసని అయినా, దాని గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నేడు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్య ఈసారైనా ఈ ప్రాజెక్టు గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరావుని అడుగుతారా.. లేదా..? అని టేకులపల్లి మండల ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2018 లోనే సీతారామ ప్రాజెక్టు రోళ్లపాడు ప్రాజెక్టుపై ఆందోళన చేసిన, శంకుస్థాపనపై నిలదీసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లతో పాటు మరో పదిమంది మీద కేసు నమోదు చేసి అక్రమంగా జైలులో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడే సీతారామ ప్రాజెక్టుపై అనేక ఆందోళనలు చేశామని పాలకులు ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తలాపున గోదావరి ఉన్నా సుక్క నీరు లేకుండా రైతాంగం మొత్తం నానా ఇబ్బందులు పడుతుంటే రోళ్లపాడు ప్రాజెక్టు తీసుకొచ్చి రైతుల కాళ్లు కడుగుతాం.. అని చెప్పిన మంత్రులు ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మెజార్టీ ఆదివాసీలకు అన్యాయం చేశారని ఇది మంచి పద్ధతి కాదని వాపోయారు. ఇప్పటికైనా రోళ్లపాడు ప్రాజెక్టును రీడిజైన్ చేసి ఇల్లెందు నియోజకవర్గానికి నీళ్లు అందించాలని రైతాంగాన్ని కాపాడాలని, అది కూడా ఈ వ్యవసాయ సంవత్సరానికి అందించాలని కోరారు. ఒక పక్క ఓసీల పేరుతో టేకులపల్లిని వినాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా టేకులపల్లి మండల ప్రజలు ఆలోచన చేసి టేకులపల్లి మండల పరిరక్షణకై రోళ్లపాడు ప్రాజెక్టు కట్టే వరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోగా సతీష్, నాగరాజు, మోహన్, వెంకటేష్, విష్ణు, శంకర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.